క్లుప్తంగా

ప్రభుత్వ ఉద్యోగిపై అసభ్యకర పోస్టులు

యువకుడి అరెస్ట్

చెరుకుపల్లి: ప్రభుత్వ ఉద్యోగిపై అసభ్యకర పోస్టులు పెట్టిన యువకుడు కటకటాలు పాలైన ఘటన చెరుకుపల్లిలో చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ టి.అనీల్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. చెరుకుపల్లిలో పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించి ఇటీవల ఈవోపీఆర్డీగా పదోన్నతి పై వెళ్ళిన ఈవూరు విజయ్‌బాబు అనే ఉద్యోగిని ఉద్దేశించి మండలంలోని గుళ్లపల్లి గ్రామానికి చెందిన వాగు దినేష్ అనే యువకుడు వాట్సాప్ స్టేటస్‌లో అసభ్యకర పోస్టులు పెట్టాడు. దీన్ని గమనించిన విజయ్‌బాబు దినేష్‌ను ప్రశ్నించగా.. అసభ్యంగా దూషించాడు. దీనిపై విజయ్‌బాబు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా శనివారం దినేష్‌ను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరచినట్లు ఎస్ఐ అనీల్‌కుమార్ తెలిపారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన



వేమూరు: ఆకుకూరలు, కూరగాయలు ఇంట్లోనే పండించుకుని, వాటిని ఆహారంలో భాగంగా చేసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అమృతవాణి తెలిపారు. మండల కేంద్రంలోని పర్యావరణ పరిరక్షణపై శనివారం ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ఇంట్లో పండించే ఆకుకూరలు, కూరగాయలు వాడుకోవాలని ఆమె సూచించారు. కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా జీఎస్టీ తగ్గింపు వల్ల పలు రకాల వస్తువులు తక్కువ రేట్లకే వస్తున్నాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంగన్‌వాడీ కార్యకర్తలు వి.సరోజిని, వి.రాజలక్ష్మి, రాజకుమారి, రెబ్బమ్మ, అమల, ధనమణి, మాధవి పాల్గొన్నారు.

నల్లమోతువారిపాలెంలో పశు వైద్యశిబిరం



కర్లపాలెం: పశువులకు వచ్చే వ్యాధులకు సకాలంలో వైద్య సేవలందించాలని కర్లపాలెం పశు వైద్యులు షేక్ తాహా అన్సారీ తెలిపారు. కర్లపాలెం సత్యసాయి గ్రామీణ సేవా సమితి ఆధ్వర్యంలో నల్లమోతువారిపాలెంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 500 గేదెలు, మేకలు, గొర్రెలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. రైతులకు ఉచితంగా పశువుల మందులు అందజేశారు. సత్యసాయి గ్రామీణ సేవా సమితి ప్రతినిధి తుమ్మల శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు తాండ్ర సాంబశివరావు, నాయకులు, మాడా శ్రీనివాసరావు, ఆట్ల బాల శంకర్‌రెడ్డి, మోహన కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

ఘర్షణలో వ్యక్తి మృతి

వేమూరు(భట్టిప్రోలు): ఘర్షణలో వ్యక్తి మృతి చెందిన ఘటన భట్టిప్రోలులో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. భట్టిప్రోలు గ్రామానికి చెందిన కారుమూరు రాంబాబు(70)కు ఇద్దరు కుమార్తెలు. ఈక్రమంలో రాంబాబు మేనల్లుడు లోయా ఏసు, చిన్న అల్లుడితో కలిసి రాంబాబుతో తెల్లవారుజామున ఘర్షణ పడ్డారు. ఈక్రమంలో వారు కొట్టడంతో కారుమూరు రాంబాబు మృతి చెందాడని ఆయన భార్య సీతమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు ఘటనాప్రాంతానికి చేరుకుని, మృతదేహాన్ని శవ పంచనామాకు తరలించి, అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించామని ఎస్ఐ అంబటి శివయ్య తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

శ్రీకాళీమాత ఆలయంలో ముగిసిన ఉత్సవాలు

తెనాలి: స్థానిక శివాజీచౌక్‌లోని కాళీమాత దేవస్థానంలో శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు ముగిసిన సందర్భంగా శనివారం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ ముఖ్యఅతిథిగా హాజరై, అమ్మవారిని దర్శించుకున్నారు. అన్నప్రసాద వితరణను ప్రారంభించారు. దేవస్థానం కమిటి చైర్మన్ గుమ్మడి రమేష్, యర్ర శ్రీనివాసరావు, అడపాల నాగేశ్వరరావు, కందేపి సీతారామయ్య, పాటిబండ్ల గోపి, నక్కా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. అనంతరం అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించి, నిమజ్జనం చేశారు.

8న తెనాలిలో ఉచిత మెగా హెల్త్ క్యాంప్

తెనాలిఅర్బన్: కె.ఎస్.కె.విద్యాసంస్థల సీఈవో డాక్టర్ కత్తెర డేవిడ్ యశ్వంత్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 8న ఐతానగర్‌లోని శ్రీ పొట్టి శ్రీరాములు కల్యాణ మండపంలో ఉచిత మెగా హెల్త్ క్యాంపును నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతుందన్నారు. జనరల్ మెడిసిన్, గైనిక్, ఈఎన్‌టీ, అప్తామాలజీ, డెర్మాటాలజీ, పాల్మానాలజీ, తదితర వైద్యులు అందుబాటులో ఉండి సేవలందిస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

మురుగు.. తొలగించరూ..!



వేమూరు ఎస్సీ కాలనీలో రోడ్డుపై నిలిచి పోయిన మురుగు నీరు



కాలనీలోని మరొక వీధిలో దుస్థితి

- వేమూరు ఎస్సీ కాలనీలో డ్రైయిన్లు లేక ఇబ్బందులు
- వాడుకనీరు, వర్షం నీరు పోయే మార్గం లేక రోడ్లపై నిలుస్తున్న మురుగు
- మురుగునీటిలో దోమలు వృద్ధి.. జ్వరాల బారిన స్థానికులు
- పట్టించుకోని అధికారులు

వేమూరు: మండల కేంద్రమైన వేమూరులో మురుగు కాల్వలు సరిలేక, ఇళ్లలో వాడుక నీరు, వర్షం నీరు పోయే దారి లేక మురుగు నీరు రహదారులపై నిలిచిపోతోంది. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా గ్రామంలోని ఎస్సీ కాలనీలోని సీసీ రోడ్లకు ఇరువైపులా డ్రైయిన్లు లేక.. ఇళ్లలో వాడుకనీరు పోయే మార్గం లేక రోడ్లపై మురుగు నిలిచిపోతోంది. తద్వారా ఆ నీళ్లలో దోమలు వృద్ధి చెంది.. కాలనీవాసులు జ్వరాలబారిన పడుతున్నారు. నిలిచిపోయిన మురుగు నీటి తొలగింపునకు పంచాయతీ అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని గ్రామస్తులు వాపోయారు. కాలనీలో ఇప్పటికే కొందరు జ్వరాల బారిన పడిఉన్నారని, అదేవిధంగా అతిసార సైతం ప్రబలిందని తెలిపారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు గ్రామంలో సిమెంట్ రోడ్లుపై నిలిచి పోయిన మురుగు నీరును తొలగించాని కోరుతున్నారు. అదేవిధంగా కాలనీలో పక్కా డ్రెయిన్లు నిర్మించి, వాడుకనీరు, వాననీరు పోయే మార్గం ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేశారు.

వేధింపులకు గురిచేస్తున్న మైక్రో ఫైనాన్స్ సంస్థలు

- అధిక వడ్డీలు వసూలు చేస్తూ పేదల రక్తం పీలుస్తున్న సంస్థలపై చర్యలు తీసుకోవాలి
- సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్



బాధితులతో కలసి మాట్లాడుతున్న సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్

రేపల్లె: పేదలను వేధింపులకు గురిచేసే మైక్రో ఫైనాన్స్ సంస్థలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఎం పట్టణ కార్యదర్శి సిహెచ్ మణిలాల్ డిమాండ్ చేశారు. పట్టణంలోని అరుంధతీనగర్‌లో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో మైక్రోఫైనాన్స్ బాధితులతో కలిసి శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐఐహెచ్ఎఫ్ఎల్ సంస్థ పేదల వద్ద అబద్దాలు చెప్పి ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల పట్టాలను తనఖా పెట్టుకుని రుణాలు మంజూరు చేసిందన్నారు. రెండు సంవత్సరాల క్రితం ప్రభుత్వం ఇచ్చిన ఇళ్లపట్టాలు, ఖాళీ చెక్కులను తీసుకుని రూ.3లక్షల రుణం ఇస్తామని చెప్పి వారి బ్యాంక్ ఖాతాలలో రూ.2,82,000 మాత్రమే జమ చేశారన్నారు. తక్కువ వడ్డీ అని, ప్రాసెసింగ్ ఫ్రీజ్ లేదని, ఇన్స్యూరెన్స్ ఉందని ఇంగ్లీషులో ఉన్న అగ్రిమెంట్‌లో అబద్దాలు చెప్పి సంతకాలు పెట్టించుకున్నారన్నారు. నేడు ఏడు సంవత్సరాల పాటు నెలకు రూ.7000 చొప్పున చెల్లించాలని సంస్థ ప్రతినిధులు ఇబ్బందులు పెడుతున్నారన్నారు. వాస్తవంగా దానిలో అసలు నెలకు రూ.2000 మాత్రమే చెల్లించాలని, నెలకు రూ.5000 వడ్డీ కట్టాలని వేధింపులకు గురిచేయటం తగదన్నారు. రుణాలు పొందిన కొంత మంది మహిళలకు సంస్థ ఏజెంట్లు రాత్రుల సమయంలో ఫోన్ చేసి వేధింపులకు గురిచేస్తుండటం గమనార్హమన్నారు. వడ్డీలు చెల్లించలేక తమకు అందించిన అసలు మొత్తాన్ని తిరిగి సంస్థకు చెల్లించేందుకు వెళితే సంస్థ అధికారులు సరైన సమాధానం ఇవ్వటంలేదన్నారు. ప్రభుత్వం ఈ విషయంపై ప్రభుత్వం జోక్యం చేసుకుని బాధితులు వడ్డీ లేకుండా అసలు మాత్రమే సంస్థకు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, వేధింపులకు గురిచేస్తున్న ఐఎఫ్ఎల్ మైక్రోఫైనాన్స్ సంస్థపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఐద్వా రేపల్లె పట్టణ అధ్యక్షురాలు కె.నాంచారమ్మ, నాయకులు షకీరా, డీవైఎఫ్ఐ రేపల్లె ఏరియా అధ్యక్షుడు సిహెచ్ ప్రకాష్, సీపీఎం నేతలు బి.అగస్టీన్, బాధితులు దుర్గాప్రసాద్, సింధు దేవి, శైలజ, కె.బసవమ్మ, వై.శివయ్య, తదితరులు పాల్గొన్నారు.

సామూహిక ఎలుకల నివారణ ఎంతో మేలు



సామూహిక ఎలుకల నివారణకు విషపు ఎరలను కలుపుతున్న అధికారులు

బాపట్ల: సామూహిక ఎలుకల నివారణ రైతులకు ఎంతో మేలు చేస్తుందని బాపట్ల వ్యవసాయ సహాయ సంచాలకులు ధనరాజు పేర్కొన్నారు. మండలంలోని నందిరాజుతోట, పిన్నిబోయినవారిపాలెంలో సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం శనివారం చేపట్టారు. ఎలుకల నిర్మూలనలో పొలాలతోపాటు పోరంబోకు స్థలాలలో కూడా విషపు ఎరలను వాడి ఎలుకల నిర్మూలన చేపట్టవచ్చని తెలిపారు. వ్యవసాయాధికారులు ముందురోజు ఎలుకల బొరియలను గమనించాలని సూచించారు. కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ తాత జయప్రకాశ్ నారాయణ, మండల వ్యవసాధికారిణి శారద తదితరులు పాల్గొన్నారు.

వేమూరు: వరి పంటను ఎలుకలు పాడుచేయకుండా వాటి నివారణ కోసం రైతులకు మందు పంపిణీ చేయడం జరిగిందని మండల వ్యవసాయాధికారి జి.ప్రేమసాగర్ తెలిపారు. వేమూరు రైతు సేవా కేంద్రంలో ఎలుక మందు తయారు చేసి రైతులకు అందజేశారు.

చెరుకుపల్లి: మండలంలో వరిసాగు చేస్తున్న రైతులందరూ సామూహికంగా ఎలుకల నివారణ చేపట్టాలని అప్పుడే పూర్తిస్థాయిలో ఎలుకలను నివారించవచ్చని చీరాల వ్యవసాయ సహాయ సంచాలకులు టి.రత్నకుమారి అన్నారు. మండల వ్యవసాయ అధికారి ఎండీ ఫారూక్ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల వద్ద ఎలుకల నివారణకు విషపు ఎరను ఎలా తయారు చేయాలో రైతులకు అవగాహన కల్పించారు. ఏఈవోలు, రైతు సేవ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

రేపల్లె: సాగుకు అపార నష్టం కలగజేసే ఎలుకల నిర్మూలనపై ప్రతి రైతు దృష్టిసారించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి అవ్వారు మహేష్‌బాబు అన్నారు. సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు రైతుసేవా కేంద్రాలలో రైతులకు ఎలుకల నిర్మూలనపై శనివారం అవగాహన కల్పించారు. వరి పంట ప్రస్తుతం ఈనే దశలో ఉందని, ఈ దశలో ఎలుకలు సాగుకు తీవ్ర నష్టం మిగుల్చుతాయని పేర్కొన్నారు. రైతులందరూ సామూహికంగా ఎలుకల నివారణపై దృష్టిసారిస్తే వాటిని నివారించవచ్చన్నారు. ఎలుకల నిర్మూలనకు బ్రోమోడైలిన్ ఉపయోగించే విధానంపై ప్రయోగపూర్వకంగా రైతులకు వివరించారు. గ్రామ సెక్రటరీలు, వ్యవసాయ అధికారులు, సహాయకులు పాల్గొన్నారు.

ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు



వేమూరు(భట్టిప్రోలు): రోడ్ల మలుపుల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు లేక పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని పెద పాలెం గ్రామస్తులు వాపోయారు. భట్టిప్రోలు మండలంలోని పెదపాలెం గ్రామానికి చెందిన దున్నా మధుసుదన్, జైపాల్‌లు శనివారం సొంత ఖర్చులతో ప్రమాద హెచ్చరిక బోర్డులు శనివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెదపాలెం మలుపు వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయని, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆర్అండ్‌బీ అధికారులను ఎన్నోసార్లు కోరినా ఫలితం లేదన్నారు. దీంతో ప్రమాదల నివారణకు సొంత ఖర్చుతో ప్రమాద బోర్డు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గ్రామస్తులు పాల్గొన్నారు.

రేపు తెనాలిలో మాస్టర్ ప్లాన్‌పై ప్రత్యేక సమావేశం

తెనాలిఅర్బన్: సీఆర్‌డీఏ ఆధ్వర్యంలో, ఆర్‌వీ ఇంజినీరింగ్ కన్సల్‌టెంట్ లిమిటెడ్ వారి సహకారంతో తెనాలి పట్టణ మాస్టర్ ప్లాన్‌పై ప్రత్యేక సమావేశాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ జాగారపు రామ అప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. తెనాలి పట్టణ మాస్టర్ ప్లాన్‌ను తయారు చేసేందుకు ఆర్‌వీ ఇంజినీరింగ్ కన్సల్‌టెంట్ లిమిటెడ్ సంస్థకు ప్రభుత్వం అప్పగించిందని తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటలకు మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో జరిగే సమావేశంలో ముఖ్యఅతిథులుగా రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పాల్గొంటారని చెప్పారు. మాస్టర్ ప్లాన్‌పై సలహాలు, సూచనలు స్వీకరించడం జరుగుతుందన్నారు. పట్టణ ప్రముఖులు, వివిధ సంస్థల నిర్వాహకులు పాల్గొనాలని కోరారు.

పెదనందిపాడులో నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రత్తిపాడు: రోటరీ క్లబ్ పెదనందిపాడు ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు చిన్నం శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ ఎంపీపీలు నర్రా బాలకృష్ణ, ముద్దన నగరాజకుమారి సౌజన్యంతో స్థానిక ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో కాటూరి మెడికల్ కళాశాల, హాస్పిటల్ సహకారం వైద్యసేవలు అందించనున్నట్లు పేర్కొన్నారు. శిబిరంలో జనరల్ మెడిసిన్, గుండె, ఎముకలు, కీళ్లు, ఈఎన్‌టీ, చర్మ వ్యాధులు, పల్మనాలజీ, అప్తమాలజీ, స్త్రీ ప్రసూతి వైద్యసేవలు అందించడం జరుగుతుందన్నారు. అదే విధంగా కంటి పరీక్ష, కంటి శుక్లాలకు పొర ఆపరేషన్లను ఉచితంగా చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, శిబిరానికి హాజరయ్యే వారు తమ ఆధార్‌కార్డు వెంట తెచ్చుకోవాలని శ్రీనివాసరావు సూచించారు.

వయసు మళ్లిన వారికి ఆరోగ్య జాగ్రత్తలు అవసరం

బ్యాంక్ విశ్రాంత ఉద్యోగుల ఉచిత వైద్యశిబిరంలో వీవీ జగదీష్‌కుమార్



వైద్యశిబిరంలో పరీక్షలు

తెనాలి: ఆరోగ్యానికి మించిన సంపద లేదని, ప్రతి వారూ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని భారతీయ స్టేట్‌బ్యాంక్ తెనాలి రీజినల్ మేనేజర్ జగదీష్ కుమార్ అన్నారు. ముఖ్యంగా వృద్ధులు ఆరోగ్యం విషయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. భారతీయ స్టేట్‌బ్యాంక్ దేశవ్యాప్తంగా చేపట్టిన కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక కొత్తపేటలోని బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో బ్యాంక్ విశ్రాంత సిబ్బందికి ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. రీజినల్ మేనేజర్ జగదీష్‌కుమార్ ప్రారంభించారు. బ్యాంకు ఆదేశాలపై తెనాలితోపాటు రీజినల్ పరిధిలోని పొన్నూరు, బాపట్లలోనూ వైద్యశిబిరాలను నిర్వహించినట్టు చెప్పారు. రమేష్ హాస్పటల్స్ సహకారంతో డాక్టర్ మహిధర్ పర్యవేక్షణలో 70 మందికి పైగా బ్యాంక్ విశ్రాంత ఉద్యోగులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. డాక్టర్ మహిధర్ మాట్లాడుతూ అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, అత్యవసరమైన వారికి మెరుగైన వైద్యం అందించే ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. బ్యాంక్ ప్రధానశాఖ అధిపతి వాసుదేవరావు, ముఖ్య కార్యనిర్వహణాధికారి తిరుమలరావు, అడ్మినిస్ట్రేటివ్ సిబ్బంది మణికంఠ, బ్యాంక్ మార్కెటింగ్ కన్సల్టెంట్ సాయి లక్కరాజు పాల్గొన్నారు.

సూపర్ జీఎస్టీ, సేవింగ్స్‌పై అవగాహన కల్పించాలి

ఎంపీడీఓ అత్తోట దీప్తి



మాట్లాడుతున్న ఎంపీడీఓ

తెనాలిటౌన్: సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై ప్రజలందరికి అవగాహన కల్పించాలని ఎంపీడీవో అత్తోట దీప్తి పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం డ్వాక్రా సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో అత్తోట దీప్తి, వాణిజ్యశాఖ డిప్యూటీ కమిషనర్ ముత్యాలరావు పాల్గొని ప్రభుత్వం ఇటీవల వస్తు సేవలపై తగ్గించిన జీఎస్టీ వివరాలను వెల్లడించారు. వ్యవసాయ, కుటీర చిన్నతరహా పరిశ్రమాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న సభల్లో జీఎస్టీపై మహిళలకు అవగాహన కల్పించాలని తెలిపారు. అక్టోబర్ 19వ తేదీ వరకు జీఎస్టీ తగ్గింపు ప్రజలకు వివరించాలని సూచించారు. దాదాపు 800 రకాల వస్తువులపై జీఎస్టీ తగ్గిందని, గతంలో 12 శాతం ఉన్న జీఎస్టీ కొన్ని వస్తువులపై 5శాతం తగ్గిందని, ప్రజలు గమనించాలని సూచించారు. చిన్న తరహా పరిశ్రమల వారు తయారుచేసిన వస్తువులను విక్రయించేందుకు 6వతేదీన తహశీల్దార్ కార్యాలయం వద్ద ప్రదర్శన, అమ్మకం ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో జీఎస్టీ అధికారులు నవీన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రఖ్యాత పర్యావరణ వేత్త జేన్ గూడాల్‌కి ఘన నివాళి



ప్రఖ్యాత పర్యావరణ వేత్త జేన్ గూడాల్‌కు నివాళులర్పిస్తున్న రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం

ఏఎన్‌యూ(పెదకాకాని): ప్రఖ్యాత పర్యావరణవేత్త ఎథోలాజిస్ట్, ప్రిమటాలజిస్ట్, ఆంత్రోపాలజిస్ట్, జీవహక్కుల పోరాట యోధురాలు జేన్ గుడాల్ చేసిన పరిశోధనలను విద్యార్థులు పరిశోధకులు ఆదర్శంగా తీసుకోవాలని వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం కోరారు. వర్సిటీలోని రిజిస్ట్రార్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన గుడాల్ చిత్రపటానికి పూలమాలలు వేసిన అధికారులు ఆమెకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం మాట్లాడుతూ టాంజానియాలోని గోంబే స్ట్రీమ్ నేషనల్ పార్క్‌లో చింపాంజీల మీద ఆమె విస్తృతంగా పరిశోధనలు చేశారన్నారు. జీవ సంక్షేమం, పర్యావరణ పరిరక్షణపై ఆమె చేసిన కృషిని యువ పరిశోధకులు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. పర్యావరణ విభాగాధిపతి ఆచార్య స్వామి మాట్లాడుతూ జీవుల మధ్య సామరస్యాన్ని కాపాడడానికి జేన్ గుడాల్ చేసిన కృషి అమోఘమైందన్నారు. బీఓఎస్ చైర్మన్ డాక్టర్ పి.బ్రహ్మాజీరావు మాట్లాడుతూ మానవుడు చింపాంజీల మధ్య అంతఃసంబంధాలను పరిశోధించడం ద్వారా గుడాల్ పర్యావరణ పరిరక్షణకు జీవుల మధ్య సామరస్యం ఎంతో కీలకమని ధ్రువీకరించారన్నారు. కార్యక్రమంలో వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య చేబ్రోలు లింగరాజు, వర్సిటీ ఎలక్ట్రికల్ డీఈఈ ఎస్.వెంకటేశ్వర్లు, బాలుర వసతి గృహాల డెప్యూటీ వార్డెన్లు డాక్టర్ ఎస్.బాబు, డాక్టర్ కె.శశిధర్, పరిశోధకులు సతీష్, కృష్ణ నాయక్ పాల్గొన్నారు.

సూపర్ జీఎస్టీపై అవగాహన



ర్యాలీలో పాల్గొన్న అధికారులు

పొన్నూరు: నిడుబ్రోలులో చేనేత సహకార సంఘంలో జీఎస్టీ 2.0పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సదస్సులో ముఖ్య అతిథులుగా చేనేత, జౌళీ శాఖ అధికారులు రాజ వర్ధన్, శ్రీధర్ బాబు పాల్గొని ప్రజలు, వినియోగదారులకు సూపర్ జీఎస్టీ, సేవింగ్‌పై వివరించారు. వాణిజ్య పన్ను శాఖ అసిస్టెంట్ కమిషనర్ వై.వి.కృష్ణవేణి మాట్లాడుతూ జీఎస్టీ 2.0 కొత్త లక్ష్యాలు, ప్రజలకు లభించే ప్రయోజనాలు, సూపర్ జీఎస్టీ ద్వారా కొనుగోలుదారులకు కలిగే లాభాలు వివరించారు. డెప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ ఎల్.రాధికా మాట్లాడుతూ సూపర్ సేవింగ్స్ ద్వారా వస్తువులపై తగ్గింపు ధరలు, కొనుగోలు విధానాలను తెలియజేశారు. ఎంపీడీవో గుమ్మ చంద్ర శేఖర్ రావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవారి విగ్రహాల ఊరేగింపు



చినపరిమిలో అమ్మవారి విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు



కొలగానివారిపాలెం పురవీధులలో కనకదుర్గమ్మ అమ్మవారి విగ్రహం ఊరేగింపు

నగరం: దసరా శరన్నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని మండలంలోని ఆయా గ్రామాలలో ఏర్పాటుచేసిన కనకదుర్గమ్మ అమ్మవారి విగ్రహాల ఊరేగింపు మహోత్సవం శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. నవరాత్రుల విశేష పూజలనంతరం అమ్మవారి ప్రతిమలను గ్రామ పురవీధులలో గ్రామోత్సవం చేశారు. మండలంలోని నగరం, కొలగానివారిపాలెం, ఈదుపల్లి, మీసాలవారిపాలెం, దాసరిపాలెం, తాడివాకవారిపాలెం, పరిశావారిపాలెం గ్రామాలలో కనకదుర్గమ్మ అమ్మవారి ఊరేగింపును సంప్రదాయబద్ధంగా జరిపారు. అమ్మవారి విగ్రహాలను ప్రత్యేక వాహనంపై ఉంచి గ్రామంలో ఊరేగింపు చేశారు. అనంతరం విగ్రహాలను నిమజ్జన నిమిత్తం పెనుమూడిలోని కృష్ణా నదికి తరలించారు.

చినపరిమిలో...

చుండూరు(వేమూరు): దసరా మహోత్సవాలు సందర్భంగా చుండూరు మండలంలోని చిన పరిమి గ్రామం రజక బజారుకు చెందిన అమ్మవారి విగ్రహాన్ని శనివారం ఘనంగా ఊరేగించి, అనంతరం పెదరావూరు లాకుల వద్ద నిమజ్జనం చేశారు. సాయంత్రం గ్రామస్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కాపుల సమస్యల పరిష్కారానికి కృషి



జనార్ధన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

తెనాలిఅర్బన్: కూటమి ప్రభుత్వ విజయానికి కృషి చేసిన కాపులకు సమస్యలు సృష్టించడం మంచి పద్ధతి కాదని కాపు జేఏసీ వ్యవస్థాపకులు చందు జనార్ధన్ పేర్కొన్నారు. వంగవీటి రాధా రంగా స్మారక కాపు యువజన సేవా సమితి వ్యవస్థాపకులు తన్నీరు శివశంకర్ ఆధ్వర్యంలో సోమవారం బోసురోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాపుల హక్కుల సాధన కోసం ఇప్పటికే ప్రభుత్వ పెద్దలకు మెమోరండాలు అందజేయడం జరిగిందన్నారు. కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాల వారికి ఉన్న రిజర్వేషన్ సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కాపుల ఆకాంక్షలు నేరవేర్చే విధంగా ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. శివశంకర్ మాట్లాడుతూ కాపు జేఏసీని ఏర్పాటు చేసి హక్కుల సాధన కోసం నిరాంతరం జనార్ధన్ పోరాటం చేస్తున్నాయని కొనియాడారు. అనంతరం ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో శెట్టిపల్లి సుబ్రమణ్యం, పేటేటి రవికుమార్, కమ్మెల రజిని, కమ్మెల శ్రీనివాసరావు, పెద్దిశెట్టి హనుమంతరావు, తవిటి భాస్కరరావు, నాగం రాంజీ, మారుతి, తదితరులు పాల్గొన్నారు.

దాతల దాతృత్వం ప్రశంసనీయం

గుంటూరు రూరల్: అంకిరెడ్డిపాలెంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల అదనపు గదులను శనివారం ప్రారంభించారు. స్థల దాతలు శ్యామల గోపాలరెడ్డి, రామసుశీల దంపతుల జ్ఞాపకార్థం కుమారులు శ్రీనివాసరెడ్డి, రఘునాథరెడ్డి కుమార్తెలు మేకా శివనాగేంద్రం, మువ్వా నాగమల్లేశ్వరి, బట్టగిరి ధనలక్ష్మి, అల్లుడు మువ్వా ఈశ్వరరెడ్డి కుటుంబ సభ్యుల సహకారంతో దాదాపు పన్నెండు లక్షల రూపాయలతో నిర్మించారు. మోడల్ ప్రైమరీ స్కూల్‌గా అప్ గ్రేడ్ అనంతరం పాఠశాలలో గదుల కొరత, విద్యార్థుల అసౌకర్యాన్ని గుర్తించి మెగా పేరెంట్స్‌డే కార్యక్రమంలో విద్యాకమిటీ, ఉపాధ్యాయుల విన్నపాలకు స్పందించిన దాతలు ఈశ్వర రెడ్డి శ్రమించి రెండు నెలల్లో నిర్మాణం పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చి ప్రభుత్వానికి అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గాయత్రిదేవి, రిటైర్డ్ వ్యాయామ అధ్యాపకుడు సంజీవరెడ్డి మాట్లాడుతూ దాతలు స్పందించి నిర్మాణం చేపట్టడం హర్షణీయమని చెప్పారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటరు శ్యామల వెంకటరమణాదేవి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చావా సరోజిని, ఉపాధ్యాయులు రామచంద్రరావు, హనుమంతరావు, శ్రీనివాసరావు గ్రామ పెద్దలు మాజీ సర్పంచి బ్రహ్మారెడ్డి, శ్రీనివాసరెడ్డి, కుర్రా పుల్లారెడ్డి పాల్గొన్నారు.

పండ్లు, కూరగాయల మొక్కలు నాటాలి

నాగులపాడు(కాకుమాను): పాఠశాల ఆవరణలోని ఖాళీ స్థలంలో పండ్లు, కూరగాయల మొక్కలు నాటుకోవాలని ఎంఈఓ కె.ఎఫ్.కెన్నడీ సూచించారు. స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను శనివారం పరిశీలించారు. పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు నాటి సంరక్షించిన పండ్లు, కూరగాయల మొక్కలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాల ఆవరణలో నాటిన కూరగాయలతో ప్రతి రోజు విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి వినియోగించాలని సూచించారు. మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం మౌనిక పాల్గొన్నారు.